

మాట్లాడుతున్న కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

ఓటరు దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలి

- కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

కలెక్టరేట్, ఫిబ్రవరి 6: ఓటరు చేర్పుల కోసం వచ్చే దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ అధికారులను ఆదేశించారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఆయన జేసీ నవీన్‌తో కలిసి మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నోడల్ అధికారులు ముందస్తు రోడ్ మ్యాప్ తయారు చేయాలని, సత్వరమే ఫారం-6, ఫారం-8 దరఖాస్తులను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రాల వారీగా పరిశీలించాలన్నారు. ఈ నెల 15 నాటికి పెండింగ్‌లో ఉన్న డూప్లికేట్, మరణించిన, తదితర దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలను తక్షణమే పూర్తి చేయాలని, ఫిర్యాదులపై స్పందించి తగు చర్యలు తీసుకోవాలని, ట్రైనింగ్ షెడ్యూల్ తయారు చేయాలని ఆదేశించారు. గతంలో ఏయే పోలింగ్ కేంద్రాల్లో తక్కువ పోలింగ్ జరిగిందో గుర్తించి, అక్కడ పోలింగ్ శాతం పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. శిక్షణ, ఓటింగ్, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్, బ్యాలెట్ పేపర్లు, తదితర కమిటీలపై ఆయన సమీక్షించారు. అందరూ వారికి కేటాయించిన విధులను విజయవంతంగా నిర్వర్తించాలని తెలిపారు. టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డీటీసీ చంద్రశేఖరరెడ్డి, ఉప కలెక్టర్ అప్పారావు, డీఆర్డీఏ పీడీ విద్యాసాగర్, డ్వామా పీడీ చిట్టిరాజు, డిప్యూటీ సీఈవో వెంకటరామన్, జిల్లా బీసీ సంక్షేమాధికారి అనూరాధ, సీపీవో లక్ష్మీ ప్రసన్న, డీఎస్సీ బాలరాజు, బీసీ కార్పొరేషన్ ఈడీ గడ్డెమ్మ, తహసీల్దార్లు, డీటీలు పాల్గొన్నారు.


చెరువు ఉండాలి!



- మాయం చేస్తున్న అక్రమార్కులు
- యథేచ్ఛగా ఆక్రమణలు
- గర్భాల్లో వెలుస్తున్న పొలాలు
- సాగునీరు అందక రైతుల్లో ఆందోళన

- మెళియాపుట్టి మండలం ముకుందపురం పంచాయతీలోని ముకుందసాగరం గర్భం రెవెన్యూ రికార్డుల ప్రకారం 47 ఎకరాలు. ప్రస్తుతం సుమారు 20 ఎకరాలు ఆక్రమణకు గురైంది. దీంతో ఈ సాగరం పరిధిలోని 200 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు సక్రమంగా అందక పంటలు దెబ్బతింటున్నాయని రైతులు ఆందోళ చెందుతున్నారు.

- మెళియాపుట్టి మండలం జాడుపల్లి గ్రామంలోని పెద్ద చెరువు రెవెన్యూ రికార్డుల్లో 33 ఎకరాలుగా నమోదై ఉంది. ప్రస్తుతం 15 ఎకరాలు మాత్రమే మిగిలింది. కొందరు ఈ చెరువు గర్భాన్ని ఆక్రమించి పంటలు పండిస్తున్నారు. ఏకంగా బోర్లు తవ్వి కూరగాయలను సాగు చేస్తున్నారు. దీంతో చెరువు విస్తీర్ణం తగ్గి నీరు నిల్వ ఉండడం లేదని రైతులు వాపోతున్నారు.



(మెళియాపుట్టి)

జిల్లాలో చాలా చెరువులు ఆక్రమణకు గురవుతున్నాయి. జిల్లాలో 6,564 సాగు నీటి చెరువులు ఉండగా ఇందులో వంశధార పరిధిలో 269 వరకు ఉన్నాయి. గత కొన్నేళ్లుగా పలు చెరువులు ఆక్రమణకు గురై కనుమరుగవుతున్నాయి. అక్రమార్కులు చెరువు గర్భాలను ఆక్రమించి పొలాలుగా మార్చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ ఆక్రమణలు ఎక్కువయ్యాయనే విమర్శలు ఉన్నాయి. వేసవిలో చెరువులు ఎండిపోగానే గుట్టుచప్పుడు కాకుండా గట్లు తొలగించి ఆక్రమణలకు పాల్పడుతున్నారు. ఇతర ప్రాంతాల నుంచి మట్టిని తీసుకువచ్చి చెరువులను కప్పేసి పొలాలుగా తయారు చేస్తున్నారు. ఒక్క మెళియాపుట్టి మండలంలోనే 80 సాగు నీటి చెరువులకు గాను 58 చెరువులు ఆక్రమణకు గురైనట్లు అధికారులు గుర్తించారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నీరుచెట్టు పథకం ద్వారా చెరువులను అభివృద్ధి చేసేవారు. అధికంగా నిధులు మంజూరు చేసి పనులు చేయడంతో పాటు చెరువు గర్భంలో ఆక్రమణలు తొలగించే వారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఇరిగేషన్ పనులకు నిధులు మంజూరుకాకపోవడంతో ఆక్రమణలు అధికంగా జరుగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. అధికార పార్టీ నాయకులకు చెందిన సంబంధికులే ఈ అక్రమణలకు పాల్పడున్నట్లు విమర్శలు ఉన్నాయి. దీంతో ఏటా చెరువుల విస్తీర్ణం తగ్గి సాగునీరు నిల్వ ఉండడం లేదని, దీనివల్ల పంటలకు పూర్తిస్థాయిలో నీరు అందడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించాలని కోరుతున్నారు.

ఆక్రమణలు గుర్తిస్తున్నాం..

ప్రస్తుతం ఉపాధి పనులు చేస్తున్న సమయంలో చెరు వులు ఆక్రమణకు గురైనట్లు తెలిస్తే మాకు తెలియజేయాలి. వెంటనే అక్కడకు వెళ్లి ఆక్రమణలు గుర్తించి తొలగిస్తాం. ప్ర స్తుతం అందిన ఫిర్యాదుల మేరకే ఆక్రమణలు తొలగిస్తున్నాం.

-చలపతిరావు, మండల సర్వేయర్, మెళియాపుట్టి

ఉపరాష్ట్రపతిని కలిసిన ఎంపీ రామ్మోహన్



ఉపరాష్ట్రపతితో మాట్లాడుతున్న ఎంపీ రామ్మోహన్‌నాయుడు

శ్రీకాకుళం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్‌ను మంగళవారం ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు కలిశారు. ఆయనతో పాటు ఎంపీలు గల్లా జయదేవ్, కనకమేడల ఉపరాష్ట్రపతిని కలసి పలు విషయాలపై చర్చించారు.

వచ్చే ఎన్నికల్లో మా సత్తా చూపిస్తాం

- సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు గొండు శంకర్
- అసెంబ్లీ ముట్టడికి వెళ్తుండగా అడ్డుకున్న పోలీసులు



పోలీసు స్టేషన్‌లో నిరసన తెలియజేస్తున్న గొండు శంకర్ తదితరులు

అరసవల్లి, ఫిబ్రవరి 6: 'వైసీపీ ప్రభుత్వం సర్పంచ్‌ల హక్కులను హరించింది. పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేసింది. సర్పంచ్‌ల న్యాయపరమైన 16 డిమాండ్లను ఇప్పటికైనా పరిష్కరించాలి. లేదంటే వచ్చే ఎన్నికల్లో మా సత్తా ఏంటో చూపిస్తాం'మని ఉమ్మడి జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గొండు శంకర్ అన్నారు. మంగళవారం అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి జిల్లా నుంచి వెళ్తున్న సర్పంచ్‌లను గుంటూరు జిల్లా నల్లపాడు వద్ద పోలీసులు అడ్డుకుని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. 14, 15వ ఆర్థిక సంఘం నిధులను ప్రభుత్వం పక్కదారి పట్టించిందని, పంచాయతీలను పూర్తిగా నిర్వీర్యం చేసిందని, గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం మాయమైందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీరాజ్ ఉపాధ్యక్షుడు ఆనెపు రామకృష్ణంనాయుడు, సంఘం ఆర్గనైజింగ్ కార్యదర్శి పిన్నింటి భానోజీనాయుడు, శ్రీకాకుళం నియోజకవర్గ అధ్యక్షుడు కొంక్యాన ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి రుప్ప రమణమూర్తి, కార్యదర్శి భైరి నరేష్, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలతో మాకేం పని?

- వంశధారలో ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు
- నది మధ్యలోకి యంత్రాలను తీసుకెళ్లి..

ఆమదాలవలస, ఫిబ్రవరి 6: మండలంలోని చవ్వాకులపేట వంశధార నదీ పరివాహక ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఇసుక ర్యాంపులో నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరుగుతున్నాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు నదిలో ఎటువంటి యంత్రాలు వినియోగించకూడదు. అలాగే లారీలను కూడా నది మధ్యలోకి తీసుకెళ్లకూడదు. కానీ, ఇక్కడ యంత్రాలతో ఇసుకను తవ్వి లోడ్ చేయడం పరిపాటిగా మారింది. లారీలు నది లోపలకు వెళ్తున్నాయి. గతంలో ఇలాగే పురుషోత్తపురం ఇసుక ర్యాంప్ వద్ద లారీలు నది మధ్యలోకి వెళ్లాయి. అయితే, ఒక్కసారిగా నదిలో నీటి ప్రవాహం పెరిగిపోవడంతో 16 లారీలు చిక్కుకున్నాయి. లారీ సిబ్బంది అతి కష్టం మీద ఒడ్డుకు చేరుకున్నారు. అయినా వారిలో మార్పు రావడం లేదు. ర్యాంప్ నుంచి విశాఖపట్నం తదితర ప్రాంతాలకు ఇసుక రవాణా చేస్తున్న సమయంలో టార్పాలిన్లు కప్పడం లేదు. దీంతో గాలికి ఇసుక ఎగిరి ద్విచక్ర వాహన చోదకులు, ప్రజల కళ్లల్లో పడి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల చవ్వాకులపేట నుంచి ఆమదాలవలస ప్రధాన రహదారి మధ్యలో అధిక బరువుతో ప్రయాణించిన ఇసుక లారీలు పలుమార్లు బోల్తాపడ్డాయి. ఎటువంటి పత్రాలు లేని ఒక ఇసుక లారీ ఆమదాలవలస పోలీసులకు పట్టుబడింది. చవ్వాకులపేట ర్యాంపు వద్ద తవ్వకాలకు ప్రభుత్వం ప్రతిమ ఏజెన్సీకి అనుమతి ఇచ్చింది. ఈ ఏజెన్సీ నిబంధనలు పాటించకపోయినా గనులశాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఇసుక లారీలతో ప్రమాదాలు జరుగుతుండడంతో ఇటీవల పొన్నంపేట గ్రామస్థులు ఆందోళనకు దిగారు. ఇసుక లారీలను అడ్డగించడంతో ఆమదాలవలస పోలీసులు రంగ ప్రవేశం చేసి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అయినా ఇంతవరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరుతున్నారు.



టార్పాలిన్ లేకుండా ప్రధాన రహదారిపై వెళుతున్న ఇసుక లారీ



చవ్వాకులపేట వద్ద వంశధార నది లోపల ఇసుక లారీలు



- నేడు ఓటాన్ అకౌంట్ బడ్జెట్
- అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న వైసీపీ ప్రభుత్వం

నిధులు విదిల్చేనా?

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

వైసీపీ ప్రభుత్వం 2024-2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బుధవారం అసెంబ్లీలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను సమర్పించబోతోంది. అయితే ఇందులో జిల్లాకు ఏ మేరకు నిధులు కేటాయిస్తారన్నది ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశం అవుతోంది. ఎన్నికల సమయం కావడంతో ఈ బడ్జెట్‌లో జిల్లాకు ఏ మేరకు ప్రాధాన్యం కల్పిస్తారన్నది ప్రశ్నార్థకంగా మారింది. వాస్తవంగా నాలుగున్నరేళ్ల కాలంలో వైసీపీ ప్రభుత్వం జిల్లాలో చెప్పుకోదగ్గ అభివృద్ధి పనులు చేపట్టింది లేదు. సాగునీటి ప్రాజెక్టులకు పెద్దగా నిధులు కేటాయించలేదు. బిల్లులు సకాలంలో చెల్లించడం లేదు. దీంతో ఆయా పనులు నేటికీ నత్తనడకనే సాగుతున్నాయి. అయితే కొద్ది నెలల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో వైసీపీ ప్రభుత్వం జిల్లాకు ఏ స్థాయిలో నిధులు కేటాయిస్తుందో వేచి చూడాల్సి ఉంది. కాగా 'సిక్కోలు'లో సాగునీటి ప్రాజెక్టులకు ఎంతెంత నిధులు అవసరమో ఇప్పుడు తెలుసుకుందాం.

తోటపల్లి ప్రాజెక్టు..

నాగావళి నదిపై ఉన్న సర్దార్ గౌతు లచ్చన్న తోటపల్లి ప్రాజెక్టు ద్వారా శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని 1,31,221 ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. దీనికోసం పిల్ల కాలువలు, మైనర్, సబ్‌మైనర్ కాలువలు మొత్తం 68 కిలోమీటర్ల మేర తవ్వాల్సి ఉంది. కానీ, సగం మాత్రమే పూర్తయ్యాయి. సబ్‌మైనర్ కాలువలు అధికప్రాంతం జిల్లాలోనే తవ్వాల్సిఉంది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.80.84 కోట్లు భూసేకరణకు, ఆర్‌అండ్‌ఆర్‌కు కేటాయించారు. చెల్లింపులు ఆలస్యం కావడంతో పిల్లకాలువల తవ్వకాల్లో జాప్యం చోటుచేసుకుంటుంది.

నేరడి బ్యారేజీ..

నేరడి బ్యారేజీ నిర్మాణానికి ఒడిశా ప్రభుత్వం అంగీకరించకపోవడంతో.. గొట్టా బ్యారేజీ కుడి ప్రధాన కాలువ నుంచి 12 టీఎంసీల నీటిని మళ్లించి హిరమండలం రిజర్వాయర్‌ను నింపేందుకుగాను ఎత్తిపోతల పథకం పనులు గతేడాది ప్రారంభమయ్యాయి. రెండేళ్ల క్రితం ఒడిశా సీఎంను మన సీఎం కలసి నేరడి బ్యారేజీ విషయమై మాట్లాడారు. ఈ విషయాన్ని అధికార పార్టీ గొప్పగా ప్రచారం చేసుకుంది. కానీ, నేరడి బ్యారేజీకి ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ప్రత్యామ్నాయంగా ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టారు. రూ. 140.17 కోట్లను కేటాయించారు. కానీ పనులు నత్తనడకన సాగుతున్నాయి. పూర్తి చేసిన పనులకు సంబంధించి కాంట్రాక్టర్లు బిల్లులు పెడుతున్నా.. సీఎఫ్‌ఎంఎస్‌లో అప్‌లోడ్ కావడం లేదు.

ఆఫ్‌షోర్ రిజర్వాయర్..

పలాస మండలం రేగులపాడు గ్రామం వద్ద ఆఫ్‌షోర్ రిజర్వాయర్ నిర్మాణానికి గత ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కుడి, ఎడమ ప్రధాన కాలువల ద్వారా నందిగాం, పలాస, మెళియాపుట్టి మండలాల్లో 24,600 ఎకరాల ఆయకట్టుకు నీరు అందించాల్సి ఉంది. పనులు, భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్ కోసం రూ. 325.45 కోట్లు ఖర్చుచేశారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఆఫ్‌షోర్ ప్రాజెక్టు అంచనాను పెంచి రూ.852.45 కోట్లను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించింది. ఇప్పటివరకు పనులు 45 శాతం మేర మాత్రమే పనులు జరిగాయి. పనులకు సంబంధించి రూ. 7.52 కోట్లు, భూసేకరణకు సంబంధించి రూ. 7కోట్లు చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నాయి.

గొట్టా బ్యారేజీ..

సుమారు 45 ఏళ్ల క్రితం రాతితో గొట్టా బ్యారేజీ ఎడమ ప్రధాన కాలువ నిర్మించారు. ప్రస్తుతం కాలువ సగం భాగం దెబ్బతింది. నీటి ప్రవాహం 2,480 క్యూసెక్కుల నుంచి 1980 క్యూసెక్కులకు తగ్గిపోయింది. కాలువ ఆధునికీకరణకు రూ.954 కోట్లు అవసరమని, నిధులు మంజూరుచేయాలని ఇంజనీరింగ్ అధికారులు ఏటా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నా రూపాయి కూడా మంజూరు కావడంలేదు. గొట్టా బ్యారేజీ కుడి ప్రధాన కాలువ గట్టు కూడా కోతకు గురైంది. సీసీ లైనింగ్ నిర్మాణం చేపట్టేందుకు గాను రూ. 22.88 కోట్లు అవసరం. ప్రతిపాదనలు తయారుచేసి ప్రభుత్వానికి పంపారు. కానీ నిధులు మంజూరు కాలేదు.

- ఈ ఏడాది వంశధార ఫేజ్-2 పనులు పూర్తికావాలంటే.. ఎత్తిపోతల పథకం, హైలెవల్ కాలువ పనులు కొనసాగాలంటే కచ్చితంగా రూ. 200 కోట్లు అవసరం.. ఇందులో పెండింగ్ బిల్లులే రూ. 50 కోట్లు, భూ సేకరణకు రూ. 30 కోట్లు అవసరం. నిధులు కేటాయించి.. విదిల్చితేనే సాగునీటి వనరులు వినియోగమవుతాయి. ఎన్నికల ఏడాది కావడంతో ఇప్పుడైనా ప్రభుత్వం ఆశించిన స్థాయిలో నిధులు కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రయాణికుల ముసుగులో గంజాయి రవాణా

- పలాస రైల్వే స్టేషన్‌లో పోలీసులకు చిక్కిన ముఠా
- 10 కిలోల సరుకు స్వాధీనం

పలాస, ఫిబ్రవరి 6: ఓ గంజాయి ముఠా సాధారణ ప్రయాణికులుగా అవతారం ఎత్తారు. రెండు బ్యాగుల్లో గంజాయిని సర్దేసి ఎంచక్కా రైలు ఎక్కేందుకు స్టేషన్‌కు వచ్చారు. అక్కడ మఫ్టీలో ఉన్న పోలీసులను చూసి నడక వేగాన్ని పెంచారు. పోలీసులు వారిని పట్టుకొని బ్యాగులను తనిఖీ చేయగా బండారం బయట పడింది. 10 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని నలుగురిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. పలాస ఎస్‌ఐ పారినాయుడు వివరాల మేరకు.. తమిళనాడుకు చెందిన తల్లీకుమారుడు లతాపాలరాజు, రాజారామ్‌తో పాటు ఎం.రాధ మంగళవారం మెళియాపుట్టి మండలం గొప్పిలి గ్రామం వద్దకు వచ్చారు. ఇక్కడ వీరికి ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడికి చెందిన ఎస్.అప్పారావు అనే వ్యక్తి 10 కిలోల గంజాయి (రెండు ప్యాకెట్లు) అందించాడు. ఈ ప్యాకెట్లను రెండు బ్యాగుల్లో సర్దేసి వాటిని పట్టుకొని తిరిగి తమిళనాడు వెళ్లేందుకు లతా పాలరాజు, రాజారామ్, రాధ పలాస రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. పోలీసులకు సమాచారం అందడంతో వారిని అదుపులోకి తీసుకొని గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ముగ్గురితో పాటు పర్లాకిమిడికి చెందిన అప్పారావును అరెస్టు చేసి పలాస కోర్టులో హాజరుపరిచారు. ఈ సందర్భంగా నిందితుడు అప్పారావు మాట్లాడుతూ.. 'నాకు తమిళనాడుకు చెందిన కొందరితో ఫోన్‌లో పరిచయం ఏర్పడింది. మరో వ్యక్తి ద్వారా మెళియాపుట్టి మండలం గొప్పిలి వద్దకు గంజాయిని తీసుకు వచ్చాను. ఇక్కడ తమిళనాడు నుంచి వచ్చిన ముగ్గురు కూలీలకు అందించాను. దీనికిగాను నాకు పది కిలోలకు రూ.5వేలు ఇస్తారు. తమిళనాడు కూలీలకు కిలోకు రూ.5వేల చొప్పున అక్కడున్న ముఠా అందిస్తుంది. అంతవరకే నాకు తెలుసు'నని చెప్పాడు. అయితే, ఈ ప్రాంతంలో కిలో రూ.3వేలకు కొనుగోలు చేసి అక్కడ రూ.30నుంచి రూ.50వేలు వరకూ అమ్ముతారని పోలీసులు చెబుతున్నారు. ఒడిశాలోని మల్కన్‌గిరి, గజపతి, మోహన బ్లాక్‌ల్లో ఉన్న గిరిజన ప్రాంతాల్లో వీటిని అధికంగా పండిస్తూ మన ప్రాంతం మీదుగా చెన్నై, బెంగళూరు ప్రాంతాలకు తరలిస్తుంటారని తెలిపారు. గంజాయి రవాణాదారులను పట్టుకున్న పోలీసు సిబ్బందిని ఎస్‌ఐ అభినందించారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి బ్యాగులు



పలాస రైల్వే స్టేషన్ వద్ద నిందితులను ప్రశ్నిస్తున్న పోలీసులు


వజ్రపుకొత్తూరు: నగరంపల్లిలో పల్లె పల్లెకు టీడీపీలో పాల్గొన్న నేతలు


మెళియాపుట్టి: టీడీపీ మేనిఫెస్టోను ప్రజలకు వివరిస్తున్న సాగర్


సంతబొమ్మాళి: మూలపేటలో పర్యటిస్తున్న దాసునాయుడు


హరిపురం: బుడార్సింగిలో పల్లెపల్లెకు టీడీపీ నిర్వహిస్తున్న నాయకులు


టెక్కలి: పాత్రపురంలో బాబు ష్యూరిటీ నిర్వహిస్తున్న బగాది శేషగిరి


పలాస: మాట్లాడుతున్న టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మురళీకృష్ణ

వైసీపీ అరాచకాలను ఎండగట్టండి

రాష్ట్రంలో సాగుతున్న వైసీపీ అరాచకాలను ఎండగట్టాలని టీడీపీ నాయకులు కోరారు. మంగళవారం పల్లె పల్లెకు టీడీపీ, బాబు ష్యూరిటీలను నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ మేనిఫెస్టోపై వివరించారు.

వైసీపీ పాలనను తిప్పి కొట్టాలి: కలమట

పాతపట్నం: రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనతో అన్ని వర్గాలు ఇబ్బందులు పడుతున్నాయని, రానున్న ఎన్నికల్లో ఈ పార్టీని తిప్పి కొట్టి టీడీపీని గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణమూర్తి కోరారు. పాతపట్నం శివశంకర్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆ వీధిలో పూర్తిగా పాడైన రోడ్డును పరిశీలించి ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇంటింటి కొళాయి పేరుతో సీసీ రోడ్లను తవ్వేశారని, దీంతో ఈ రోడ్లపై ప్రజలు ఎలా రాకపోకలు సాగిస్తారని ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వంలో సమస్యల పరిష్కారానికి మార్గం లేదని, టీడీపీని గెలిపించడం ద్వారా గ్రామాలను అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పైల లక్ష్మయ్య, సైలాడ సతీష్, రుంకు చలపతిరావు, బి.వసంత ఇప్పిలి రాజా తదితరులు పాల్గొన్నారు.

బీసీల ద్రోహి జగన్: బగ్గు

జలుమూరు (సారవకోట): బీసీల ద్రోహి సీఎం జగన్మోహన్ రెడ్డి అని, ఈయన పాలనలో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. కూర్మనాథపురం పంచాయతీ మత్రిపాడులో మంగళవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గతంలో టీడీపీ బీసీలకు రాయితీలపై ఇచ్చిన రుణాలతో ఆర్థికంగా నిలదొక్కుకునేలా అవకాశం కల్పించిందని, ప్రస్తుత వైసీపీ పాలనలో ఆ పరిస్థితి లేదన్నారు. వైసీపీ అరాచక పాలనను ప్రజలు గ్రహించారని, వారిలో తిరుగుబాటు మొదలైందన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం టీడీపీ అధినేత చంద్రబాబు నాయకత్వాన్ని బలపరచాలని కోరారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర బీసీ కమిటీ ప్రతినిధి ధర్మాన తేజకుమార్, పార్టీ మండల అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ, నాయకులు సురవరపు తిరుపతిరావు, పి.నందకిశోర్, భైరి భాస్కరరావు, డి.జయరాం, రేణంకి గణపతిరావు, తాడేల భీమారావు తదితరులు పాల్గొన్నారు.

● **వజ్రపుకొత్తూరు:** రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమి విజయం తథ్యమని టీడీపీ మండల అధ్యక్షుడు సూరాడ మోహనరావు అన్నారు. మంగళవారం నగరంపల్లి, పెద్దబడాంలో పల్లెపల్లెకు టీడీపీ కార్యక్రమం నిర్వహించారు. వైసీపీ పాలనలో అన్ని రకాల ధరలు పెరగడంతో పాటు అన్ని రంగాలు నాశనమయ్యాయన్నారు. దీంతో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు మళ్లీ సీఎం కావాల్సిన అవసరం ఉందని, అందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా టీడీపీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు దువ్వాడ జయరాం చౌదరి, దువ్వాడ హేమబాబుచౌదరి, అర్సవెల్లి ఉమామహేశ్వరరావు, దువ్వాడ అప్పారావు, సనపల చక్రవర్తి, బగాది చల్లయ్య, పీత శంకరరావు, నెయ్యిల సూర్యనారాయణ, అబంటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


సారవకోట మండలం మత్రిపాడులో కరపత్రాలు ఇచ్చి అవగాహన కలిగిస్తున్న మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

● **మెళియాపుట్టి/కొత్తూరు:** రాష్ట్రంలోని అరాచక పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కలమట సాగర్ అన్నారు. మంగళవారం మెళియాపుట్టి, కొత్తూరుల్లో పర్యటించి ప్రజలను చైతన్యం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో సామాన్యులను బతకనీయడం లేదన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. అనంతరం బాబు ష్యూరిటీ నిర్వహించి టీడీపీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు భాస్కర్‌గౌడ్, కదంబల పైడిరాజ్, పరమేష్‌రెడ్డి, వసంత్, చక్రి, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● **సంతబొమ్మాళి:** రాష్ట్రంలో రానున్నది చంద్రబాబు నాయకత్వంలోని చంద్రన్న రాజ్యం అని, అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని తెలుగుయువత జిల్లా అధ్యక్షుడు మెండ దాసునాయుడు అన్నారు. మంగళవారం మూలపేట, లింగూడు పంచాయతీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. టీడీపీ హయాంలో మత్స్యకారుల అభ్యున్నతికోసం అనేక పథకాలు ప్రవేశపెట్టిందని, అయితే ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం వాటిని విస్మరించిందన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీకి మద్దతివ్వాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్ష, కార్యదర్శులు జీరు భీమారావు, రెడ్డి అప్పన్న, నేతలు పరపటి రాజశేఖర్, సూరాడ ధనరాజ్, కూశెట్టి భానుప్రకాష్, బెండి అరుణ్‌కుమార్, కోట నారంనాయుడు, సుందరరావు పాల్గొన్నారు.

● **హరిపురం:** ఏజెన్సీ ప్రాంతంలో మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం టీడీపీ, గౌతు కుటుంబం చలవేనని టీడీపీ మండల అధ్యక్షుడు బావన దుర్యోధన అన్నారు. బుడార్సింగి, మరదమేక, పాతకోట, రాం పురం గ్రామాల్లో మంగళవారం పల్లె పల్లెకు టీడీపీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు జిల్లా అధికార ప్రతినిధి దాసరి తాతారావు మాట్లాడుతూ.. రైతుల పరిస్థితి మెరుగు పడాలంటే మళ్లీ బాబు సీఎం కావాలని కోరారు. ఆ దిశగా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు తమిరి భాస్కరరావు, రట్టి లింగరాజు, పుడియా సన్యాసి, సర్పంచ్ వాసు, సాలిన మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

● **పలాస:** టీడీపీ ప్రభుత్వ హయాంలోనే పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ అభి వృద్ధి చెందిందని వక్తలు అన్నారు. మంగళవారం 26, 28 వార్డులకు సంబంధించి ఉదయపురంలో వార్డు వార్డుకు టీడీపీ కార్యక్రమం గ్రామసభ నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థుల ను గెలిపించి చంద్రబాబునాయుడును మళ్లీ సీఎంగా చేసేలా పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో నేతలు వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరరావు యాదవ్, గాలి కృష్ణారావు, గురిటి సూర్యనారాయణ, టంకాల రవి శంకర్‌గుప్తా, శాసనపురి మురళీ కృష్ణ, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, మల్లేసు, నర్సింహులు, ఆశారాణి పాల్గొన్నారు.

● **టెక్కలి:** రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన నవరత్నాలతో నవ మోసాలకు పాల్పడిందని టీడీపీ మండల అధ్యక్షుడు బగాది శేషగిరి అన్నారు. మంగళవారం నర్సింగపల్లి పంచాయతీ పాత్ర పురం, నరహరిపురం గిరిజన గ్రామాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ మేనిఫెస్టోను వివరించారు. కార్యక్రమంలో నేతలు మట్ట పురుషోత్తం, హనుమంతు రామకృష్ణ, బసవల అప్పలస్వామి, మామిడి రాము, కోళ్ల లవకుమార్, పోలాకి షణ్ముఖరావు, దారపు జోగారావు తదితరులు పాల్గొన్నారు.

● **ఇచ్ఛాపురం రూరల్:** చంద్రబాబు తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ నాయకుడు లోపింటి పద్మనాభం అన్నారు. మంగళవారం పాయితారి, కీర్తిపురం గ్రామాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి టీడీపీ మేని ఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. గిన్న బాలరాజు, మురళి తదితరులు పాల్గొన్నారు.

● **పొందూరు:** రాపాకలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు సీహెచ్ రామ్మోహన్, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి బలగ శంకరభాస్కర్ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి టీడీపీ మినీ మేనిఫెస్టోపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


పాతపట్నం: శివశంకర్ కాలనీ రోడ్డును చూపుతున్న కలమట వెంకటరమణ


ఇచ్ఛాపురం రూరల్: కరపత్రాలు పంపిణీ...


పొందూరు: రాపాకలో బాబు ష్యూరిటీ..

బరంపురం-పలాస-దుర్గ్ రైలు వేయండి

వజ్రపుకొత్తూరు: బరంపూర్, పలాస, వయా విజయనగరం మీదుగా చత్తీస్‌ఘడ్ రాష్ట్రం దుర్గ్ వరకు కొత్త రైలు నడపాలని ఆంధ్ర ఉత్కళ్ సంఘర్ష్ సమితి అధ్యక్షుడు, డోకులపాడు గ్రామస్థుడు ఉమాశంకర్ కోరారు. ఈ మేరకు దుర్గ్ ఎంపీ విజయ్ భఘేల్‌తో కలిసి రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్‌ని కలిసి ఈ రైలు అవసరాన్ని వివరించి వినతిపత్రం అందించారు. పలాస ప్రాంతం నుంచి భిలాయి, దుర్గ్, రాయిపూర్‌కు ప్రజలు నిత్యం ప్రయా ణాలు సాగిస్తుంటారని, అయితే నేరుగా రైలు లేకపోవడంతో విజయనగరం, విశాఖ వెళ్లి రైలు ఎక్కాల్సి వస్తోందన్నారు. దీంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని మంత్రికి వివరించినట్లు తెలిపారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఉమాశంకర్ పేర్కొన్నారు.


రైల్వే మంత్రికి వినతిపత్రం అందిస్తున్న ఉమాశంకర్

వసతిగృహ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ


మాట్లాడుతున్న జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి అనూరాధ

నరసన్నపేట: బీసీ, సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లో ఉంటూ పదో తరగతి చదువుకుంటున్న విద్యార్థు లకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి ఇ.అనూరాధ అన్నారు. మంగళవారం స్థానిక బీసీ బాలికల వసతి గృహాన్ని సందర్శించి పునశ్చరణ తరగతులను పరిశీలించారు. శతశాతం ఉత్తీర్ణత సాధించేందుకు స్టడీ అవర్స్ నిర్వహించడంతో పాటు ట్యూటర్లతో బోధన చేపడుతున్నట్లు తెలిపారు. శ్రద్ధగా చదువుకుని మంచి ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూవో తట్ట త్రినాథరావు, హెచ్‌డబ్ల్యూవోలు తదితరులు పాల్గొన్నారు.

సర్వే నివేదికల్లో లోపాలుంటే చర్యలు తప్పవు

ఎల్.ఎన్.పేట: గ్రామాల్లో చేపడుతున్న సర్వే నివేదికల్లో లోపాలున్నట్లు నిర్ధారణ జరిగితే సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని, చర్యలు తప్పవని ఎంపీడీవో జి.గిరిబాల అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపికకు గాను వలంటీర్ల ద్వారా చేస్తున్న సర్వేలకు సచివాలయ సిబ్బందిని అనుసంధానం చేయడం జరుగుతుందన్నారు. ఎన్నికలు సమీపిస్తున్నందున పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అవసరమైన మౌలిక వసతులను ఏర్పాటు చేసేలా బీఎల్వోలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమా వేశంలో ఈవోపీఆర్డీ ఐ.పద్మజ తదితరులు పాల్గొన్నారు.

జీడికి గిట్టుబాటు ధర కల్పనకు చర్యలు తీసుకోండి

పలాస: జీడి పంటకు మద్దతు ధర కల్పించి ఉద్దానం రైతులను ఆదుకునేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కె.బాలకృష్ణ యాదవ్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు డి.పురందేశ్వరిని కలిసి వినతిపత్రం అందించారు. మద్దతు ధర లేక రైతులు వలసలు పడుతున్నారని వివరించారు. అలాగే ఆర్థికంగా వెనుకబడిన తెలగ కులస్థులను బీసీలో చేర్పించాలని, పొందర, శిష్టకరణం, వైశ్య, సొండి కులస్థులను ఓబీసీలో చేర్పించాలని కోరారు.

ఉపాధి కూలీలకు వేతనాలు సక్రమంగా చెల్లించాలి


సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్న డ్వామా పీడీ చిట్టిరాజు

పలాసరూరల్: గ్రామాల్లో ఉపాధి పనులు చేపడుతున్న కూలీలకు వేతనాలను సక్రమంగా, పనికి తగ్గ వేతనం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీ జీవీ చిట్టిరాజు అన్నారు. ఉపాధి హామీ కార్యాలయం ఆవరణలో ఉపాధి పనుల సామాజిక తనిఖీ ప్రజావేదికను మంగళవారం నిర్వహించారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో సామాజిక తనిఖీ బృంద ప్రతినిధులు గ్రామసభలు నిర్వహించి చేపట్టిన ఉపాధి హామీ పనుల పై చర్చించారు. ఎం. బుక్ సరిగా నిర్వహించాలని, కూలీల హాజరులో తప్పులున్నాయని, ఇది పునరా వృతం కాకూ డదని అధికారులు ఆదేశించారు. కార్యక్రమంలో డీవీవో బి.లవరాజు, హెచ్ఆర్ మేనేజర్ శ్రావణ్ కుమార్, ఎస్‌క్యూసీవో సతీష్‌బాబు, సోషల్ ఆడిట్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యాప్రమాణాలు పెంపొందించాలి

నరసన్నపేట: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు పెంపొందించాలని, దీనికి నోటు, వర్క్ బుక్కులను ఉపయోగించాలని ఎంఈవో పేడాడ దాలినాయుడు సూచించారు. మంగళవారం చిన్నకరగాం ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఎండీఎం, పాఠశాల పరిశుభ్రత బాధ్యత ఉపాధ్యా యులపై ఉందన్నారు. కార్యక్రమంలో పరిశీలకుడు హెచ్.ఆనందరావు, సీఆర్ఎంటీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం రేపు

మందస: మందస పొందరవీధిలో ఆంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం గురువారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహక కమిటీ అధ్యక్షుడు పొందర దుధిష్టి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అన్నప్రసాద వితరణ, శ్రీనివాస యోగిచే ఆధ్యాత్మిక ప్రవచనాలు ఏర్పాటు చేశామన్నారు. భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకోవాలని ఆయన కోరారు.

హైకోర్టు మొట్టికాయలు పెట్టినా చలించరా?

● కొండలపై రోడ్లు పూర్తి చేయాలని గిరిజనుల ఆందోళన

మెళియాపుట్టి, ఫిబ్రవరి 6: గిరిజన ప్రాంతాల్లో ఇంకా డోలీలను చూస్తే ఆదిమ సమాజం గుర్తొస్తోందని హైకోర్టు ఈనెల ఒకటిన అభిప్రాయపడుతూ నోటీసులు జారీ చేసినా వైసీపీ ప్రభుత్వం స్పందించడం లేదని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి అన్నారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో 'గిరిజనులనా.. ఇంత నిర్లక్ష్యం' శీర్షికతో కథనం వచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో చంద్రగిరి గ్రామంలో స్థానిక గిరిజనులతో కలిసి ఆయన ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొండలపై ఉన్న గ్రామాలకు రోడ్డు సదుపాయం లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులపై పత్రికల్లో కథనాలు రావడంతో ఎలిశెట్టి సోమయాజులు ప్రజా ప్రయోజన వ్యాజ్యం వేశారని, దీనిపై హైకోర్టులో విచారణ జరిగిందన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్లవుతున్నా ఇంకా ఆదివాసీలను కష్టాలు వెంటాడడం దారుణమన్నారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో అభివృద్ధి చెందుతున్నామని చెప్పుకోవడానికి ప్రభుత్వానికి సిగ్గులేదా అని అన్నారు. వైసీపీ ప్రభుత్వానికి నోటీసులిచ్చి పనులు చేయాలని న్యాయస్థానాలు తెలపడంతో సిగ్గుపడాలన్నారు. ఐటీడీఏకు ఐఏఎస్ అధికారులు వస్తే అభివృద్ధి చెందుతుందని గిరిజనులు ఆశపడినా ప్రయోజనం కనిపించడం లేదన్నారు. ఎన్నికలకు ముందు కొండలపై ఉన్న గ్రామాలకు కనీసం సగంలో నిలిచిన పనులను పూర్తి చేయకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కేంద్రప్రభుత్వ నిధులతో చేపడుతున్న పనులపై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.


చందనగిరిలో ఆందోళన చేస్తున్న గిరిజనులు

ఎన్నికల హామీలను బీజేపీ ప్రభుత్వం విస్మరించింది

కాశీబుగ్గ: గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విస్మరించిందని, ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనారి మోహన్‌రావు, సీపీఐ నాయకుడు వేణుగోపాల్ విమర్శించారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో సంయుక్త కిసాన్ మోర్చా కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వ్యవసాయం, పరిశ్రమలు, గనులు, విద్యుత్, అటవీ సంపదలను, రవాణా, బ్యాంకు లు, ఎల్ఐసీ తదితర సంస్థలన్నింటినీ ఆదానీ, అంబానీ తదితర కార్పొ రేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తున్నారని ఆరోపించారు. విశాఖకు రైల్వే జోన్, కడప ఉక్కు ఫ్యాక్టరీ ఇవ్వకపోగా తెలుగు ప్రజలు పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ఎలా అమ్మకానికి పెడతారని ప్రశ్నించారు. వీటిని వ్యతిరేకిస్తూ ఈనెల 16న దేశవ్యాప్త సమ్మె చేపడుతున్నామని, దీనిని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్ర మంలో ఆయా సంఘాల నేతలు రామారావు, సన్యాసిరావు, బాలకృష్ణ, వినోద్‌కుమార్, కుసుమ, నాగేశ్వరరావు తదితరులుపాల్గొన్నారు.


మాట్లాడుతున్న మోహన్‌రావు

నేడు పాతపట్నం-తెంబూరు మధ్య రాకపోకలకు అంతరాయం

పాతపట్నం: గంగువాడ రైల్వే గేట్ వద్ద మరమ్మతులు చేపడుతున్నందున బుధవారం పాతపట్నం- తెంబూరు మధ్య వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందని రైల్వే అధికారులు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పనులు జరుగు తాయన్నారు. ఈ విషయాన్ని ఈ మార్గం గుండా రాకపోకలు సాగించే బస్సులు, ఇతర వాహనదారులు గమనించి సహకరించాలని ఆ ప్రకటనలో కోరారు.

తీరప్రాంత గ్రామాల్లో శోభాయాత్ర

సంతబొమ్మాళి: అయోధ్యలో రామమందిర ప్రారంభం, బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ విజయోత్సవ శోభాయాత్రను విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో తీరప్రాంత గ్రామాల్లో మంగళవారం నిర్వహించారు. మేఘవరం నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీ పాతమేఘవరం, సంధిపేట, ఎం.సున్నాపల్లి, నౌపడ, సీతానగరం, సెలగపేట, మత్రిపాడు, భావనపాడు వరకు సాగింది. కార్యక్రమంలో మండల కార్యదర్శి చొక్కరి గణపతిరావు, రట్టి పెరుమాళ్లు, వాడరేవు వాసు, తిరుపతిరావు, పలు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీముఖలింగేశ్వరుని గ్రామోత్సవం

జలుమూరు: దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగంలోని ముఖలింగేశ్వర స్వామికి గ్రామోత్సవం మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. పుష్య బహుళ ఏకాదశిని పురస్కరించుకుని ఉదయం స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను పల్లకిలో వేంచేపు చేసి వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ తిరువీధి మహోత్సవం చేశారు. ఈసందర్భంగా గ్రామస్థులు స్వామికి హారతులిచ్చి దర్శించుకున్నారు. కార్యక్రమంలో అర్చకులు ఎస్.వెంకటాచలం, నారాయణమూర్తి, అప్పారావు, శ్రీకృష్ణ, శివ, దేవదాయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.


స్వామిని దర్శించుకుంటున్న మహిళలు

తాగునీటి సమస్యను పరిష్కరించండి

కోటబొమ్మాళి: అక్కయ్యవలస దళితవాడలో తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విశ్రాంత ఆర్మీ ఉద్యోగి బి.లచ్చుమయ్య ఆవేదన వ్యక్తంచేశారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. గ్రామంలో ఇంటింటికీ కొళాయిలు వేసి ఎస్సీ కాలనీలో వీధి కొళాయిలు కూడా వేయలేదని, దీనిపై స్థానిక నేతలను ప్రశ్నిస్తే ఏం చేసుకుంటావో చేసుకో అన్నారని వాపోయారు. దళితవాడపై పక్షపాతం చూపిస్తున్నార న్నారు. అధికార పార్టీ నేతలు గ్రామానికి వచ్చినప్పుడల్లా సమస్యను వారి దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం కనిపిం చలేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

9న ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

నందిగాం: జాతీయ నులిపురుగుల నివారణపై మంగళవారం ఆశా కార్యకర్తలకు అవగాహన కల్పించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి కె.అనిత కుమారి ఆధ్వర్యంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈనెల 9న మాత్రల ఆల్బెండజోల్ పంపిణీ చేపట్ట నున్నట్లు తెలిపారు. ఒకటి నుంచి 19 ఏళ్ల లోపు 5,360 మందికి మాత్రలు వేసేందుకు లక్ష్యంగా నిర్ణయించామన్నారు. ఆర్.సుకన్య దాతారాం పాల్గొన్నారు.

108 సేవలపై పరిశీలన

నందిగాం: మండలంలో 108 సేవలపై డివిజన్ ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ జి.జగన్నాథం మంగళవారం పరిశీలించారు. ఈ మేరకు వాహనాన్ని, అందులో ఉన్న మందులు, పరికరాలను పరిశీలించారు. సేవలను విస్తృతం చేయాలని సిబ్బందికి సూచించారు.

భర్త వేధిస్తున్నాడని కులపెద్ద ఇంటి ఎదుట నిరసన

కోటబొమ్మాళి: తన భర్త ఇంట్లో ఉన్న బంగారం ఇవ్వాలని నిత్యం వేధిస్తున్నాడని మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహిత కులపెద్ద ఇంటి ఎదుట మంగళవారం నిరసనకు దిగింది. బాధితురాలు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. తనకు వివాహం అయినప్పటి నుంచి మామ వేధిస్తున్నాడని, భరిస్తూ వచ్చినా ఇటీవల తన కుమార్తె పట్ల అసభ్యంగా వ్యవహరించారని ఆరోపించింది. సదరు నిందితుడు జిల్లా సబ్ జైల్‌లో రిమాండ్ ఖైదీగా ఉన్నాడని, అతనికి బెయిల్‌పై బయటకు తీసుకు వచ్చేందుకు తన భర్త డబ్బులు అవసరమని, బంగారం ఇవ్వాలని చితకబాదుతున్నాడని వాపోయింది. అయితే ఏ విషయమైనా కులపెద్దకు చెప్పకుండా ఏ పనిచేయడని, ఇప్పుడు కూడా తనపై వేధింపులకు బాధ్యత కూడా కుల పెద్దదేనని ఆమె ఆరోపించింది. చుట్టూ చేరిన గ్రామస్థులు, పెద్దల ఎదుట తన కుటుంబ పరిస్థితులను తెలిపి కన్నీరుమున్నీరైంది. ఇంట్లో 40 తులాల బంగారు పోయినట్లు భర్త అందరికీ చెబుతున్నాడని, అయితే బంగారం పోలేదని, అది బయట ఉంటే తన భర్త ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తాడని, ఈ బంగారం భద్రపరిచానని ఆమె తెలిపింది. తమ బతుకులను ఛిద్రం చేసిన వ్యక్తి బెయిల్ కోసం బంగారం ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో స్థానిక టీడీపీ నాయకుడు బోయిన గోవిందరాజులు బయట జరుగుతున్న హడావుడిని గుర్తించి బయటకు వచ్చి పరిస్థితిని అడిగి తెలుసుకుని సర్ది చెప్పడంతో సద్దు మణిగింది.

ప్రభుత్వ ఉపాధ్యాయుల బాహాబాహీ

- ఇరువురూ పోలీసులకు ఫిర్యాదు
- పెద్దరోకళ్లపల్లి ప్రాథమికోన్నత పాఠశాల టీచర్ల తీరు

టెక్కలి రూరల్: ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులు పాఠశాల తరగతిలోనే బాహాబాహీకి దిగిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. వాగ్వాదంతో ప్రారంభమై చివరికి పోలీస్ స్టేషన్‌లో ఒకరిపై ఒకరు భౌతిక దాడులకు దిగిన ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. పెద్ద రోకళ్లపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఆమదాలవలస ప్రాంతానికి చెందిన తమ్మినేని శ్రీనివాసరావు, టెక్కలికి చెందిన జి.శివానంద్ ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్నారు. మంగళవారం పాఠశాల పనివేళల సమయంలో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి శ్రీనివాసరావుపై దాడి చేశారు. తనపై దాడి సహచర ఉపాధ్యాయుడు శివానంద్ ప్రోద్బలంతోనే జరిగిందని ఆరోపిస్తూ టెక్కలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ నిమిత్తం శివానంద్‌ను స్టేషన్‌కు పిలిపించగా వచ్చారు. ఈ నేపథ్యంలో ఆయనపై శ్రీనివాసరావుతో పాటు కుటుంబసభ్యులు భౌతిక దాడికి పాల్పడ్డారు. దీంతో ఇరువురి మధ్య తోపులాట జరిగింది. శివానంద్ వారి నుంచి తప్పించుకుని పోలీస్‌స్టేషన్ లోపలకు వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో అప్పటికే ఫిర్యాదు చేసిన శ్రీనివాసరావు వర్గీయులు స్టేషన్‌లో పెద్ద కేకలు వేస్తూ సర్దిచెబుతున్న పోలీసులతో కూడా వాగ్వాదానికి దిగారు. ఉద్దేశ పూర్వకంగానే శివానంద్.. పాఠశాలలో శ్రీనివాసరావుపై దాడి చేసేలా ప్రేరేపించాడని ఆరోపిస్తూ శ్రీనివాసరావు వర్గీయులు కొద్దిసేపు స్టేషన్‌లో హడావిడి చేశారు. అక్కడే ఉన్న ఎస్ఐ-1 కె.లక్ష్మితో పాటు సిబ్బంది వారికి సర్దిచెప్పే ప్రయత్నం చేసినా శ్రీనివాసరావు, ఆయన వర్గీయులు వాగ్వాదాన్ని కొనసాగించారు. ఇదిలా ఉండగా విచారణ నిమిత్తం స్టేషన్‌కు వచ్చిన తనపై శ్రీనివాసరావు వర్గీయులు దాడి చేశారని శివానంద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్టేషన్‌కు చేరుకున్న టెక్కలి రూరల్ సీఐ ఎస్.సూర్యచంద్రమౌళి ఘటనపై పూర్తిస్థాయిలో సీసీటీవీ పుటేజీల ఆధారంగా పరిశీలన చేపట్టి కేసు నమోదు చేయాలని ఎస్ఐకి సూచించారు. ఇరువురు ఉపాధ్యాయుల పరస్పర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కె.లక్ష్మి తెలిపారు. ఇదిలా ఉండగా ఇటీవల పాఠశాలలో విద్యాశాఖ అధికారులు తనిఖీలు చేపట్టి పలు అంశాలను పరిశీలించారు. ఇదే విషయమై టెక్కలి ఎంఈవో డి.చిన్నారావు వద్ద ప్రస్తావించగా.. ఎన్నికల విధులకు సంబంధించి శ్రీకాకుళంలో శిక్షణ హాజరవుతున్నామని, శిక్షణ అనంతరం పాఠశాలలో చోటుచేసుకున్న ఘటనపై విచారణ చేపడతామన్నారు. కాగా ఇరువురు ఉపాధ్యాయులు బుధవారం నుంచి విధులకు సెలవు పెట్టినట్టు సమాచారం.

అధికారులమంటూ హల్‌చల్

రణస్థలం: ఉన్నతాధికారులమంటూ ఒక బ్యాచ్ మండలంలో సంచరిస్తోంది. ప్రైవేట్ పాఠశాలకు వెళ్లి హల్‌చల్ చేస్తోంది. పాఠశాలలు నిర్వహణ బాగులేదని, యాజమాన్యాన్ని భయపెట్టి డబ్బులు గుంజుకొనే పనిలో ఒక బ్యాచ్ మంగళవారం పలు పాఠశాలను సందర్శించారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌ను ఇద్దరు వ్యక్తులు సందర్శించి ఆర్‌టీఏ, హ్యూమన్ రైట్స్ సిబ్బందిమంటూ హడావుడి చేశారు. తాము విజయనగనం నుంచి వచ్చామని, పాఠశాల నిర్వహణ బాగులేదని, డబ్బులు ఇవ్వాలని సదరు వ్యక్తులు డిమాండ్ చేశారని ఆ పాఠశాల డైరెక్టర్ తెలిపారు. పాఠశాల వద్ద అసభ్యకరంగా ప్రవర్తించిన వారిద్దరని జేఆర్ పురం పోలీస్ స్టేషన్‌కు అప్పజెప్పారు. దీంతో ఎస్ఐ కె.గోవిందరావు విచారించగా, సదరు వ్యక్తులు పొంతన లేని సమాధానాలు ఇచ్చారు. దీంతో ఎస్ఐ వారిని మందలించి విడిచిపెట్టారు. ఇలాంటివి పుణరావతం అయితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సమ్మె ఒప్పంద జీవోలు వెంటనే విడుదల చేయాలి



ఆందోళన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

అరసవల్లి: రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమ్మె సమయంలో అంగీకరించిన ఒప్పందం మేరకు చేసిన జీవోలను వెంటనే విడుదల చేయాలని, లేకుంటే పోరాటం ఉధృతం చేస్తామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.బలరాం, ఉపాధ్యక్షుడు అరుగుల గణేష్ డిమాండ్ చేశారు. 16 రోజుల సమ్మె కాలపు ఒప్పందాల జీవోలను జారీ చేయాలని, ఇంజనీరింగ్ కార్మికుల సమస్యపై ఏర్పాటు చేసిన కమిటీ నివేదికను వెల్లడించాలని, క్లాప్ డ్రైవర్ల సమస్యలపై జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేసి చట్టబద్ధమైన జీతభత్యాలు చెల్లించాలని కోరుతూ మంగళవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కాలయాపన చేయకుండా జీవోలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఆర్.ప్రకాష్, పలాస నాయకులు సీహెచ్ మురుగన్, పి.బాలకృష్ణ, కె.వెంకటి, శ్రీకాకుళం నాయకులు ఎ.శంకర్, అర్జి శేఖర్, మోహన్, గురుస్వామి, ఎస్.వెంకటరమణ, ఎ.జనార్దన్, ఎన్.పార్వతి, ఆర్.ఈశ్వరమ్మ, డి.గణేష్, డి.చిట్టిబాబు, ఎ.రాజేష్, కె.ఆరుద్రమ్మ, ఎ.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎర్రజెండా గుర్తించకుంటే.. ప్రమాదమే



వంతెనపై పాతిన ఎర్ర జెండా

సరుబుజ్జిలి: మండల కేంద్ర సరుబుజ్జిలికి సమీపంలో ఉన్న వంశధార కుడి ప్రధాన కాలువ వంతెనపై ఏర్పాటు చేసిన ఎర్రజెండా గుర్తించకుంటే ప్రమాదం తప్పదు. సరుబుజ్జిలి నుంచి పాలకొండ వెళ్లే ఈ రోడ్డులో వంశధార కాలువపై వంతెన ఉంది. ఈ వంతెనపై ఏర్పాటు చేసిన సిమెంట్ కాంక్రీట్‌ను ఆనుకొని రెండు వైపులా వేసిన బీటీ రోడ్డు కింగిపోయింది. ద్విచక్ర వాహనదారులు ఈ కుంగిన ప్రాంతాన్ని గుర్తించకపోవడంతో అదుపుతప్పి రోడ్డుపైన పడిన ఘటనలు ఉన్నాయి. దీంతో స్థానిక యువకులు ఆ ప్రాంతంలో మంగళవారం హెచ్చరికలు చూపేలా ఎర్ర జెండాను ఏర్పాటు చేస్తూ ప్రమాదాన్ని హెచ్చరిస్తున్నారు.

బీఆర్‌ఏయూ అధ్యాపకునికి అవార్డు



చక్రపాణిని అభినందిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో లైబ్రరీ సైన్స్ విభాగంలో కాంట్రాక్ట్ అధ్యాపకునిగా పనిచేస్తున్న దువ్వ చక్రపాణి గ్లోబల్ మేనేజ్‌మెంట్ కౌన్సిల్ (అహ్మదాబాద్) జాతీయ ఎక్స్‌లెన్స్ అవార్డు-2024కు ఎంపికయ్యారు. ఈ మేరకు ఆ సంస్థ ప్రతినిధులు జ్ఞాపికను, ప్రశంసాపత్రాన్ని చక్రపాణికి పంపించారు. లైబ్రరీ సైన్స్‌లో ఈయన చేసిన కృషి, అలాగే జాతీయ జర్నల్స్‌లో ప్రచురితమైన పరిశోధనాత్మక వ్యాసాలకు ఈ అవార్డు వరించింది. ఈ నేపథ్యంలో వర్సిటీలో మంగళవారం వీసీ కేఆర్ రజని, రిజిస్ట్రార్ బిడ్డిక అడ్డయ్య అభినందించారు.

బారు.. బేజార్

- బయటపడేస్తున్న బార్‌లోని వ్యర్థాలు
- ఇబ్బందిపడుతున్న పరిసర ప్రాంతవాసులు
- పట్టించుకోని నగరపాలక యంత్రాంగం



బార్ వెనుక ఖాళీ స్థలంలో ప్లాస్టిక్ వ్యర్థాలు



సంచరిస్తున్న పందులు

శ్రీకాకుళం క్రైం: నగరంలోని ఓ బార్ నిర్వాహకుల నిర్లక్ష్యంతో ఆ ప్రాంతం అపరిశుభ్రంగా తయారైంది. ఆ బార్‌లోని ప్లాస్టిక్ వ్యర్థాలు బహిరంగ ప్రదేశాల్లో పడేస్తుండడంతో ఆ ప్రాంతమంతా దుర్గంధంగా తయారైంది. నగరంలోని డే అండ్ నైట్ కూడలి సమీపంలో వైసీపీ నాయకుడు నిర్వహిస్తున్న బార్ అండ్ రెస్టారెంట్‌లో వినియోగించే ప్లాస్టిక్, ఆహార వ్యర్థాలు బార్ వెనుక ఉన్న ఖాళీ స్థలంలో పడేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతం అపరిశుభ్రంగా తయారై ఈగలు, దోమలకు నిలయంగా మారింది. ఈ ప్రాంతంలో కళాశాలలు, ఆస్పత్రులు ఉండడంతో విద్యార్థులు, రోగులు ఇబ్బంది పడుతున్నారు. అయితే బార్ నిర్వహించేది అధికార పార్టీ నాయకుడు కావడంతో సచివాలయం ఉద్యోగులు గాని, నగరపాలక సంస్థ అధికారులు గాని పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. సామన్య వ్యాపారులు కాగితపు చెత్తను షాపు ముందు వేస్తే రూ.10 వేల వరకు జరిమానా విధించే నగరపాలక అధికారులు ఈ బార్ విషయంలో ఎందుకు చర్యలు తీసుకోవడం లేదంటూ పలువురు వ్యాపారులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై గతంలో ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని, నగరానికి కొత్తగా వచ్చిన కమిషనర్ తమీమ్ అన్సారియా దృష్టి సారించి ఈ సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ వెంకటరావు మాట్లాడుతూ.. ఖాళీ ప్రదేశాల్లో వ్యర్థాలు వేస్తే చర్యలు తప్పవన్నారు. వ్యర్థాల సేకరణకు వాహనాలు ఏర్పాటు చేశామని, వాటిని వినియోగించుకోవాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నివాసం ఒడిశాలో.. ఓటు ఆంధ్రాలో

- తుది ఓటర్ల జాబితాల్లో అవకతవకలు
- అక్రమ ఓట్లపై కోర్టును ఆశ్రయిస్తాం
- మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ

అరసవల్లి: ఒడిశా రాష్ట్రానికి చెందిన వందలాది ఓట్లు పాతపట్నం నియోజకవర్గ ఓటర్ల జాబితాలో చేర్చి తుది ఓటర్ల జాబితా విడుదల చేశారని మాజీ ఎమ్మెల్యే, పాతపట్నం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కలమట వెంకటరమణ ఆరోపించారు. మంగళవారం శ్రీకాకుళం నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. కొత్తూరు మండలం బూత్ నెంబరు 202లో ఓటర్ల జాబితాలో ఒడిశాకు చెందిన వ్యక్తుల పేర్లతో ఓట్లు నమోదు చేశారని, 81 మంది ఓటర్లు తమ గ్రామానికి చెందినవారు కాదన్నారు. గతంలో జిల్లాకు ప్రత్యేక అధికారిగా వచ్చిన శ్యామలరావుకు కలిసి ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందన్నారు. అధికార పార్టీ నాయకులకు అనుకూలంగా ఒడిశా ఓటర్లను బంధుత్వం పేరుతో హిరమండలం ఓటర్ల జాబితాలో చేరుస్తున్నారని తెలిపారు. చివరకు ఎలక్షన్ కమిషన్ కూడి విఫలమైందని, అందుకే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తున్నట్టు చెప్పారు. సీఎం జగన్‌రెడ్డి రాష్ట్రంలో ఎన్నికల స్వరూపాన్నే పూర్తిగా మార్చేశారని ఆరోపించారు. హిరమండలం జడ్పీటీసీ పొగిరి బుచ్చిబాబు మాట్లాడుతూ.. హిరమండలం మేజర్ పంచాయతీలోని బూత్ నెంబరు 303లో 262 ఓట్లు అక్రమంగా నమోదు చేశారన్నారు. కార్యక్రమంలో తేజేశ్వరరావు, జంగమ సాధికార సమితి రాష్ట్ర డైరెక్టర్ విభూది సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు



పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ, జేసీ తదితరులు

ఎచ్చెర్ల/కలెక్టరేట్: సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు ప్రారంభించింది. ఇందులో భాగంగా ఈవీఎంల పంపిణీ, పోలింగ్ తర్వాత ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ తదితర ప్రక్రియల నిర్వహణకు ఎచ్చెర్ల మండలంలోని శివానీ ఇంజనీరింగ్ కళాశాల (చిలకపాలెం)ను మంగళవారం కలెక్టర్ మంజీర్ జిలానీ సమూన్, ఎస్పీ జీఆర్ రాధిక, జేసీ ఎం.నవీన్ సందర్శించారు. ఇంజనీరింగ్ కళాశాల విస్తీర్ణం, ఒక్కో నియోజకవర్గానికి ఎన్ని గదులు తదితర అంశాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీవో రంగయ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.పద్మావతి, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ బాలరాజు, తహసీల్దార్ వి.శ్యామ్‌కుమార్, ఎస్ఐ చిరంజీవి, కళాశాల యాజమాన్య ప్రతినిధులు దుప్పల వెంకటరావు, పి.దుర్గాప్రసాద్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

బాధితుని పరామర్శించిన మాజీ మంత్రి కళా



గొల్లాజీని పరామర్శిస్తున్న కళావెంకటరావు

జి.సిగడాం: అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్న వెంకయ్యపేటకు చెందిన టీడీపీ నాయకుడు అరెళ్ల గొల్లాజీని మంగళవారం మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కిమిడి కళావెంకటరావు పరామర్శించారు. ఈయన వెంట టీడీపీ మండల అధ్యక్షుడు కుమరాపు రవికుమార్, నాయకులు టంకాల మౌళీశ్వరరావు, నక్క మురళీధరరావు, కుదిరెళ్ల బుజ్జి, భూపతి శ్రీరామ్మూర్తి, మహదాశ్యం చిన్నారావు, కంచరాన సూరన్నాయుడు, పైల రామకృష్ణ, బోగాది అప్పలనాయుడు, పి.బంగారినాయుడు, కాశి, అశోక్, కోన వెంకటరావు, భూపతి బుజ్జి, టంకాల శంకరావు, ఎం.గోవిందారావు తదితరులు ఉన్నారు.

బాలకృష్ణతో ఇచ్ఛాపురం ఎమ్మెల్యే



ఇచ్ఛాపురం: హిందూపురం ఎమ్మెల్యే, సినీహీరో నందమూరి బాలకృష్ణను ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ కలిశారు. మంగళవారం అసెంబ్లీ ఆవరణలో బాలకృష్ణ ఇచ్ఛాపురం నియోజకవర్గ పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. రానున్న ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలవాలని పార్టీ కోసం కష్టపడాలని బాలకృష్ణ కోరినట్లు ఎమ్మెల్యే అశోక్ తెలిపారు.


అప్రమత్తంగా ఉండాలి



పట్టుబడిన వాహనాలతో పోలీసులు

సరుబుజ్జిలి: ద్విచక్ర వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని సీఐ గొంప దివాకర్ వాయునందన యాదవ్ తెలిపారు. మంగళవారం సరుబుజ్జిలి పోలీసు స్టేషన్ పరిధి మూల సవలాపురం గ్రామంలో తెల్లవారు జామున నాలుగు నుంచి ఏడు గంటల వరకు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. పొందూరు, సరుబుజ్జిలి ఎస్ఐలు వై.రవికుమార్, బి.నిహార ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. రికార్డులు లేని వాహనాలను సరుబుజ్జిలి పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ దివాకర్‌యాదవ్ మాట్లాడుతూ.. పాత ద్విచక్ర వాహనాలు కొనేటప్పుడు దొంగతనాలు చేసే వ్యక్తుల నుంచి కొనవద్దన్నారు. ప్రమాదాలు జరిగితే పత్రాలు ఎవరి పేరు మీద ఉంటే వారే శిక్షార్హులు అవుతారని, ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏఎస్ఐ చంద్రనాయుడు, సి.రవిశంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి న్యాయవాదులు విధుల బహిష్కరణ



మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ని సూర్యారావు

అరసవల్లి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భూ హక్కు చట్టం-2022కు వ్యతిరేకంగా ఈ నెల 8 నుంచి 16వ తేదీ వరకు న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరిస్తున్నట్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ని సూర్యారావు అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా బార్ అసోసియేషన్ భవనంలో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భూహక్కు చట్టానికి వ్యతిరేకంగా న్యాయవాదులంతా కోర్టు విధులను బహిష్కరించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. ఎటువంటి దావాలు గానీ, సెషన్స్ కేసులు, బెయిలు కానీ, ఇతరత్రా ఎటువంటి విచారణలకు హాజరు కాకూడదని నిర్ణయించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, ప్రభుత్వ ప్లీడర్లు ఈ సమయంలో సాక్షులను ప్రవేశపెట్టకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి పొన్నాడ రాము, ఉపాధ్యక్షుడు గొంటి చంద్రమోహన్, బార్ కౌన్సిల్ సభ్యుడు గేదెల వాసుదేవరావు, పాడి సీతంనాయుడు, కూన అన్నంనాయుడు, పొన్నాడ వెంకట రమణారావు, కూన రాజారావు, కొంక్యాన సుభాష్ నాగభూషణరావు, ఖగేంద్రనాథ్, సనపల హరి, వై.మురళీ మోహనరావు, భవానీ ప్రసాద్, ఆరికతోట కృష్ణంరాజు తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన వీఆర్వోలు

బూర్జ: కొత్త కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన మంజీర్ జిలానీ సమూన్‌ను వీఆర్వో సంఘ ప్రతినిధులు మంగళవారం మర్యాద పూర్వకంగా పరిశీలించారు. ఆ సంఘ అధ్యక్షుడు, బూర్జ మండల డొంకలపర్త వీఆర్వో వంజరాపు రమేష్‌కుమార్, గౌరవాధ్యక్షుడు వేణుగోపాలరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలనాయుడు తదితరులు కలిసి రెవెన్యూకు సంబంధించి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పరిశీలన



పరిశీలిస్తున్న కమిషన్ తమీమ్ అన్సారియా

అరసవల్లి: నగరంలోని చంపా గల్లి వీధిలోని సచివాలయంలో మంగళవారం పేదల ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను నగరపాలక కమిషనర్ తమీమ్ అన్సారియా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె లబ్ధిదారులతో, సిబ్బందితో మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఆరా తీశారు.

విద్యుత్ వెలుగుల్లో ఆదిత్యాలయం



విద్యుద్దీపాలతో ఆదిత్యాలయ రాజగోపురం

అరసవల్లి: ఈ నెల 16న అరసవల్లి సూర్య నారాయణ స్వామి ఆలయంలో నిర్వహించనున్న రథసప్తమి ఉత్స వాలకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. స్వామివారి రాజగోపురాన్ని విద్యుత్తు దీపాలతో శోభాయమానంగా కనువిందు చేస్తోంది. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ ఈవో హరిసూర్యప్రకాష్ తెలిపారు.

వైభవంగా స్వామివారి కల్యాణం

అరసవల్లి: ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారికి మంగళవారం వైభవంగా కల్యాణం నిర్వహించారు. పుష్య బహుళ ఏకాదశి (మతత్రయ)ని పురస్కరించుకుని ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ కల్యాణం వైభవంగా నిర్వహించారు. అలాగే శ్రీకాకుళానికి చెందిన వి.జగన్నాథం స్వామివారిని దర్శించుకుని, శాశ్వత అన్నదాన పథకానికి రూ.లక్ష విరాళంగా ఆలయ జూనియర్ అసిస్టెంట్ బీఎస్ చక్రవర్తికి అందజేశారు. అలాగే జైళ్ల శాఖ డీఐజీ ఎంఆర్ రవికిరణ్ స్వామివారిని దర్శించుకున్నారు. వీరికి స్వామివారి జ్ఞాపికలు ఈవో అందజేశారు.

కొనసాగుతున్న బెంతు ఒరియాల నిరసన



నిరసనలో పాల్గొన్న వడ్డి జల్లుపుట్టుగ గ్రామ విద్యార్థులు

కవిటి: కులధ్రువ పత్రాలు లేకపోవడంతో మా జీవితాలు దుర్భరంగా మారుతున్నాయని, అధికారులు, నాయకులు కనికరించని కుల ధ్రువ పత్రాలు మంజూరు చేయాలని బెంతు ఒరియా విద్యార్థులు కోరారు. కవిటిలో 41వ రోజు నిరసన దీక్షలో మంగళవారం వడ్డిజల్లుపుట్టుగ గ్రామానికి చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. కుల ధ్రువీకరణ లేకపోవడంతో ప్రభుత్వ పథకాలకు నోచుకోక, ఫీజు రీయింబర్స్ అందక నష్టపోతున్నామన్నారు. పాదయాత్రలో ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన హామీ నెరవేర్చాలని కోరారు.

తెలగ కులస్థులను బీసీలో చేర్చాలి



పాదయాత్రలో పాల్గొన్న టీడీపీ నేత గట్టెం శివరామ్

ఎచ్చెర్ల: తెలగ కులస్థులను బీసీ జాబితాలో చేర్చాలని ఆ సంఘ నేత, బీసీ సాధన సంఘం అధ్యక్షుడు పల్లంట్ల వెంకట రామారావు డిమాండ్ చేశారు. ఇచ్ఛాపురంలో ప్రారంభమైన ఆయన పాదయాత్ర ఎచ్చెర్ల, చిలకపాలెం మీదుగా మంగళవారం సాగింది. చిలకపాలెం జంక్షన్ వద్ద అరిణాం అక్కివలస గ్రామ టీడీపీ అధ్యక్షుడు గట్టెం శివరామ్ ఆధ్వర్యంలో పాదయాత్రకు స్వాగతం పలికి.. పొందూరు మండలం గారపేట వరకు వారితో పాటు నడిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్నింటా వెనుకబడిన తెలగ కులాన్ని బీసీ జాబితాలో చేర్చాలన్నారు. కార్యక్రమంలో తెలగ కుల సంఘ నాయకులు లంకలపల్లి ప్రసాద్, గట్టెం రమేష్, పుణ్యపు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వృత్తివిద్యతో మెరుగైన ఉపాధి

పొందూరు: వృత్తివిద్యా కోర్సులతో విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం పి.వెంకటరావు అన్నారు. వృత్తి విద్య లో భాగంగా 9, 10వ తరగతి విద్యార్థులకు లెర్నెట్ స్కిల్స్ ఆధ్వర్యంలో ఇండస్ట్రియల్ విజిట్, టైలరింగ్ శిక్షణా సంస్థను విజిట్‌చేసి పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

దళితద్రోహి జగన్‌రెడ్డికి బుద్ధిచెప్పండి

ఆమదాలవలస: దళితుల సంక్షేమ పథకాలు రద్దు చేసిన ముఖ్యమంత్రి జగన్‌రెడ్డికి దళితులందరూ బుద్ధి చెప్పాలని మాల మహానాడు కార్యదర్శి బోనెల అప్పారావు పిలుపునిచ్చారు. మంగళవారం ఆమదాలవలసలో మాల మహానాడు సంఘ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు దళిత వర్గాలకు అందించిన 27 సంక్షేమ పథకాలను రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దళిత ద్రోహి సీఎం జగన్‌రెడ్డి రద్దు చేయడం జరిగిందన్నారు. ఐదేళ్ల పాలనలో దళితులపై అత్యాచారాలు, హత్యాకాండలు, దౌర్జన్యకాండ రాష్ట్రంలో రాజ్యమేలుతుందన్నారు. ఫిబ్రవరి 11న రాజమండ్రి సమీపంలో వేమగిరి వద్ద నిర్వహించనున్న దళిత సింహ గర్జన సభను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆమదాలవలస నియోజకవర్గ ఎస్సీ సెల్ కన్వీనర్ గుర్రాల చినబాబు, దళిత సంఘ నాయకులు తోట రాము, పొన్నాడ అప్పలసూరి, సవలాపురపు రాజారావు తదితరులు పాల్గొన్నారు.

చనిపోయినవారి ఓట్లు తొలగించాలి

గార: కుమ్మరిపేటలోని 59వ పోలింగ్ కేంద్రంలో 21 మంది చనిపోయిన ఓటర్ల పేర్లను జాబితా నుంచి ఇప్పటి వరకు తొలగించకపోవడం శోచనీయమని మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి జల్లు రాజీవ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోలింగ్ బూత్‌లో 585 మంది ఓటర్లు ఉండగా.. 242 మంది పురుషులు, 343 మంది మహిళలు ఉన్నారన్నారు. ఇందులో 21 మంది ఓటర్లు చనిపోయినా తొలగించలేదన్నారు. ఈ విషయంలో రెవెన్యూ అధికారులు చొరవతీసుకుని చనిపోయిన వారి ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించాలని కోరారు.

డ్రైవర్లకు కంటి పరీక్షలు

కవిటి: కరాపాడు టోల్‌ప్లాజా వద్ద మంగళవారం వాహనాల డ్రైవర్లకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. రోడ్డు భద్రత నెలవారీ అవగాహన కార్యక్రమంలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశామని టోల్‌ప్లాజా ప్రాజెక్టు మేనేజర్లు సెంథిల్‌కుమార్, కేవీ ప్రసాద్ తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శ్రీకాకుళం వారి సౌజన్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మేనేజరు జీవీ రమణారావు, కిరణ్‌కుమార్, శేఖర్ రాథోడ్, సంజయ్ పాల్గొన్నారు.

ఎంపీ నిధులతో సీసీ రోడ్డు

కంచిలి: అమ్మవారిపుట్టుగ గ్రామంలో ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు నిధులతో వేస్తున్న సీసీ రోడ్డు పనులను టీడీపీ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

అవినీతి రాజకీయాలకు ముగింపు పలకాలి

అరసవల్లి: అవినీతి రాజకీయాలకు తమ ఓటు హక్కుతో ముగింపు పలకాలని మాజీ మంత్రి గుండ అప్పల సూర్యనారాయణ, శ్రీకాకుళం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి పిలుపునిచ్చారు. మంగళవారం తమ స్వగృహంలో వారు విలేకరులతో మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రజాస్వామ్యాన్ని భ్రష్టు పట్టించేలా రాష్ట్రంలో ఉందన్నారు. అవినీతి, కుళ్లిన రాజకీయాలకు ముగింపు పలకాలంటే అభ్యుదయ భావాలతో ముందుకు పోయే యువత రాజకీయాల్లోకి రావాలని కోరారు. యువతే నేటి రాజకీయాలకు స్టార్ క్యాంపెయినర్లు కావాలని, అదే విజయానికి నాంది పలుకుతుందన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

ఎచ్చెర్ల: ధ్యానంతో మానసిక ప్రశాంతత ఉంటుందని పిరమిడ్స్ స్పిరిట్యువల్ మూమెంట్ సంస్థ (శ్రీకాకుళం) ప్రతినిధి కొకురి బిందుమాధవి అన్నారు. వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల (ఎచ్చెర్ల)లో మంగళవారం పిరమిడ్ ఆసనాల సాధనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌సీవీ రమణమూర్తినాయుడు, పి.చిట్టిబాబు, పిరమిడ్ సంస్థ ప్రతినిధులు చిన్మయి, టి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి



సమావేశంలో మాట్లాడుతున్న రఘురాం

జి.సిగడాం: పేద ప్రజల అభ్యున్నతికి ప్రధాని మోదీ నాయకత్వంలో ప్రవేశ పెడుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని బీజేపీ మండల అధ్యక్షుడు, విశ్వకర్మ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ వజ్జపర్తి రఘురాం అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన బూత్‌కమిటీ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి మీసాల రామకృష్ణ, నాయకులు జి.అప్పలరావు, పొగిరి దాశరథి, అప్పారావు, పోలారావు, బూత్‌కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బకాయిలున్న సంఘాలపై చర్యలు

ఇచ్ఛాపురం రూరల్: స్వయంశక్తి సంఘాలలో రుణాల రికవరీలు ఉన్న సంఘాలపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఏపీఎం ఎస్.ప్రసాదరావు అన్నారు. మంగళవారం వెలుగు కార్యాలయంలో సీఎఫ్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వయంశక్తి సంఘాల గ్రేడింగ్, మొబైల్ బుక్‌కీపింగ్, ఆన్‌లైన్ అకౌంటింగ్, వైఎస్సార్ ఆసరా పై చర్చించారు. కార్యక్రమంలో గ్రామ సంఘం అధ్యక్షుడు డి.పార్వతి, సీసీలు మోహనరావు, విష్ణుబాబు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

అరసవల్లి: భవన నిర్మాణదారులు ప్రభుత్వం సూచించిన నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని అసిస్టెంట్ సిటీ ప్లానర్ వి.వరహాలబాబు అన్నారు. నగర మున్సిపల్ కార్యాలయంలో ఏసీపీగా మంగళవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బదిలీల్లో భాగంగా రాజమండ్రి నుంచి వచ్చినట్టు తెలిపారు. కార్పొరేషన్ పరిధిలో అక్రమార్కులు ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తే కమిషనర్ ఆదేశాల మేరకు వెంటనే చర్యలు చేపడతామన్నారు. ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మాణం చేపడితే వారికి తొలి దశలోనే నోటీసులు అందజేసి అక్రమ నిర్మాణాలను తొలగిస్తామని తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే క్రిమినల్ కేసులు తప్పవని హెచ్చరించారు.

వేణుగోపాల స్వామికి క్షీరాభిషేకం



గార: శ్వేతగిరిపై వెలసిన వేణుగోపాల స్వామికి పుష్య బహుళ ఏకాదశి సందర్భంగా మంగళవారం క్షీరాభిషేకాన్ని నిర్వహించారు. ట్రస్ట్ చైర్మన్ సుగ్గు మధురెడ్డి, ఎంపీటీసీ లక్ష్మీ నృసింహదేవి దంపతుల ఆధ్వర్యంలో అర్చకులు ఎం.సాయి శర్మ ప్రత్యేక పూజలు చేశారు.